## క్లుప్తంగా

### నర్సరీలో ఖర్జూర, ఈత మొక్కల పెంపకం



కాసర్లపహాడ్‌లోని నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న ఎక్సైజ్‌శాఖ సిబ్బంది

**అర్వపల్లి :** వనమహోత్సవంలో భాగంగా వన నర్సరీలలో ఎక్సైజ్ శాఖకు సంబంధించి ఖర్జూర, ఈత మొక్కలు పెంచుతున్నట్లు తుంగతుర్తి ఎక్సైజ్ శాఖ హెడ్‌కానిస్టేబుల్ బాలాజీ, సిబ్బంది తెలిపారు. మండల పరిధిలోని కాసర్ల పహాడ్ గ్రామంలోని వన నర్సరీలో పెంచుతున్న ఖర్జూర, ఈత మొక్కలను గురువారం పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎక్సైజ్‌శాఖ కానిస్టేబుల్ నవీన్, కల్లుగీత సహకార సంఘం అధ్యక్షుడు బద్దం యాదగిరిగౌడ్, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

### పెన్షనర్స్ భవనానికి విరాళం



తిరుమలగిరిలో కడియం రామచంద్రయ్యను సన్మానిస్తున్న రిటైర్డు ఉద్యోగులు

**తిరుమలగిరి :** తిరుమలగిరి మండల కేంద్రంలో రిటైర్డు ఉద్యోగుల భవన నిర్మాణానికి బీజేపీ తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య రూ.1,00116 విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు గురువారం రామచంద్రయ్యను శాలువా, మెమొంటోతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి బన్వరి నర్సయ్య, కోశాధికారి పి.సత్యనారాయణ, జయపాల్‌రెడ్డి, సత్తిరెడ్డి, మల్లయ్య, రామ్‌రెడ్డి, రాములు, సారంగపాణి, శ్రీరాములు, ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడిగా ప్రణీత్

**తాళ్లగడ్డ (సూర్యాపేట) :** సూర్యాపేట ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడిగా పట్టణానికి చెందిన మహంకాళి ప్రణీత్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని ఆర్యవైశ్య మహాసభ సంఘం కార్యాలయంలో జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు వెంపటి వెంకటేశ్వరరావు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహంకాళి ప్రణీత్ మాట్లాడుతూ సంఘం బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కౌన్సిల్ సభ్యులు బండారు రాజా, జిల్లా నాయకుడు నూనే నాగన్న పాల్గొన్నారు.

### సాయిబాబా ఆలయంలో పూజలు, అన్నదానం



పూజలు చేస్తున్న భక్తులు

**అర్వపల్లి :** అర్వపల్లిలోని శ్రీయోగా షిరిడీ సాయిబాబా మందిరంలో గురువారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే అభిషేకాలు జరిపారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని కాసర్లపహాడ్ గ్రామానికి చెందిన మంచాల రాము-తులసి దంపతులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అర్చకులు సాయిరాం, భక్తులు పాల్గొన్నారు.

### తహసీల్దార్‌కు వినతి

**తిరుమలగిరి :** ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను గ్రామ సభలలో గుర్తించాలని సీపీఎం ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ హరిప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కడెం లింగయ్య, కదారి లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

### జీలుగ విత్తనాల పంపిణీ

**పెన్‌పహాడ్ :** రైతులు జీలుగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి అనిల్‌కుమార్ అన్నారు. గురువారం అనంతారం గ్రామంలోని నారాయణగూడెం పీఏసీఎస్‌లో రైతులకు జీలుగ విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ శ్రావణి, సీఈఓ ఆలకుంట్ల సైదులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న మండల వ్యవసాయ అధికారి అనిల్‌కుమార్

# మున్సిపాలిటీలో 100 రోజుల ప్లాన్

**సూర్యాపేట అర్బన్ :** రాష్ట్ర ప్రభుత్వం ఆదేశానుసారం జూన్ 2 నుంచి సెప్టెంబర్ 9 వరకు సూర్యాపేట మున్సిపాలిటీలో 100 రోజుల యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ గురువారం తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలో ప్రత్యేక పారిశుద్ధ్య నిర్వహణ పనులు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. కమిషనర్ అండ్ డైరెక్టర్, పురపాలక పరిపాలన శాఖ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం రోజువారి కార్యాచరణ ఉంటుందని పేర్కొన్నారు. సూర్యాపేట పట్టణ ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని పట్టణాభివృద్ధికి సహకరించాలి కోరారు.

**మెరుగైన సేవల కోసం..**

సూర్యాపేట పట్టణంలోని ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో భాగంగా ప్రజలు తమ సమస్యలను నేరుగా మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు మున్సిపల్ కమిషన్ శ్రీనివాస్ గురువారం సంబంధిత అధికారుల సెల్ నంబర్లు తెలియజేశారు. పట్టణంలోని ప్రజలు తమ సమస్యలను ఆయా నంబర్లకు టెక్స్ట్ మెసేజ్ లేదా వాట్సప్ మెసేజ్ ద్వారా తెలుపవచ్చని సూచించారు.



సూర్యాపేట మున్సిపల్ కార్యాలయం

**అధికారుల ఫోన్ నంబర్లు:**

- నీటి సరఫరా సమస్య పరిష్కారం కోసం: ఎం. తిరుమలయ్య, ఏఈ 98499 06795
- వీధి లైట్ల సమస్య పరిష్కారానికి : వై.రాజురెడ్డి, టెక్నికల్ ఆఫీసర్, 77020 00960
- మౌలిక వసతులు, ఇతరత్ర సమస్యల కోసం : బీవీ.సత్యారావు, డీఈ, 98499 06794, కిరణ్, ఈఈ, 9849906796
- పారిశుద్ధ్య నిర్వహణకు : సారగండ్ల శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, 98499 08022, యేనపల్లి యాదగిరి, ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్, 90326 82512
- టౌన్ ప్లానింగ్ విభాగం : ఉయ్యాల సోమయ్య, టీపీఓ, 86868 21450
- రెవెన్యూ విభాగం : టి.కళ్యాణి , ఆర్ఓ, ఇన్‌చార్జ్ మేనేజర్, 98499 08250
- మెప్మా : శ్వేత, టీఎమ్‌సీ 63009 58256
- అధికారులు స్పందించకుటే మున్సిపల్ కమిషనర్ 9849905912కు వాట్సప్ మెస్సేజ్ లేదా కాల్ చేయొచ్చని తెలిపారు.

## ఆర్టీసీ సిబ్బందికి అభినందనలు

**భానుపురి :** ఆర్టీసీ బస్సులో ప్రయాణికురాలు మర్చిపోయిన బ్యాగ్‌ను తిరిగి ఆమెకు అందించి నిజాయితీ చాటుకున్న సిబ్బందిని గురువారం రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఎండీ సజ్జనార్ అభినందించారు. ఈ నెల 25వ తేదీన రామిశెట్టి శాంతకుమారి అనే ప్రయాణికురాలు హైదరాబాద్ రూట్‌లో వెళ్లే బస్సులో బ్యాగ్ పొగొట్టుకుంది. ఈ బస్సులో డ్యూటీ చేస్తున్న కండక్టర్ అంజయ్య, డ్రైవర్ పాషా ఆ బ్యాగ్‌ను గుర్తించి డిపో మేనేజర్‌కు అందించారు. బ్యాగులో దాదాపు 6తులాల బంగారం ఉంది. ఈ బ్యాగ్‌ను ప్రయాణికురాలికి తిరిగి అప్పగించగా విషయం తెలుసుకున్న ఎండీ సజ్జనార్ హైదరాబాద్‌లోని తన కార్యాలయానికి కండక్టర్, డ్రైవర్‌తోపాటు డిపో మేనేజర్ లక్ష్మీనారాయణను పిలిపించి వారిని శాలువాలతో సత్కరించి అభినందించారు.



ఆర్టీసీ సిబ్బందిని అభినందిస్తున్న ఎండీ సజ్జనార్

## వైభవంగా బొడ్రాయి వార్షికోత్సవాలు

**తాళ్లగడ్డ (సూర్యాపేట) :** ప్రజలందరూ సుఖ సంతోషాలతో, పాడిపంటలతో సంతోషంగా ఉండాలని మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని 6వ వార్డు దాసాయిగూడెంలో జరుగుతున్న బొడ్రాయి మూడవ వార్షికోత్సవంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. మహిళలు బోనాలతో ర్యాలీగా వెళ్లి బొడ్రాయి, ముత్యాలమ్మ దేవాలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోమం, అభిషేకం, బోనాల సమర్పణ, జంతుబలి తదితర కార్యక్రమాలు చేపట్టారు. ఈ వేడుకల్లో మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్, చినుముల శ్రీనివాస్ రెడ్డి, సైదిరెడ్డి, లక్ష్మయ్య, సైదులు, శ్రీశైలం, మీనయ్య, తిరుమలేష్, మల్లేష్, కరుణాకర్ రెడ్డి, నాగుల వాసు, సాయి నేత తదితరులు పాల్గొన్నారు.



బోనాలతో ర్యాలీగా వెళ్తున్న మహిళలు, నృత్యం చేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ వేణారెడ్డి

## సైబర్ నేరాల నిర్మూలనపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న షీటీమ్ ఎస్ఐ నీలిమ

**సూర్యాపేటటౌన్ :** డ్రగ్స్‌ను నిర్మూలించాలని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని షీటీమ్ ఎస్ఐ నీలిమ అన్నారు. హనుమాన్ నగర్‌లోని ప్రభుత్వ నంబర్-1 ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల వేసవి శిక్షణ శిబిరానికి హాజరై మాట్లాడారు. డ్రగ్స్ నిర్మూలన, సైబర్ మోసాల పట్ల జాగ్రత్తలు, వీటి నివారణలో ఉపాధ్యాయుల పాత్ర అనే అంశాలపై స్థానిక షీటీమ్స్, పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. బ్యాంక్ ఖాతా, ఏటీఎం కార్డు, ఓటీపీ వివరాలు ఇతరులకు తెలపవద్దన్నారు. సైబర్ మోసాలపై 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. వేధింపులపై 100కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. విద్యాలయాల్లో విద్యార్థుల నడవడికపై దృష్టి పెట్టిన చెడు అలవాటుకు గురైతే సన్మార్గంలో నడపాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యతిపతి రావు, జిల్లా రిసోర్స్ పర్సన్లు వేల్పుల వెంకటేశ్వర్లు, అంకతి వెంకన్న, మధుసూదన్ రెడ్డి, ఖాదర్ పాషా, దండాల మధు, షీ టీం మహిళా కానిస్టేబుల్ ఉమా, కళాబృందం సభ్యులు పాల్గొన్నారు.

## టీపీటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



జెండా ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

**సూర్యాపేటటౌన్ :** తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జెండాను టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాపర్తి రామనర్సయ్య ఆవిష్కరించి మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సంఘం నిరంతరం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముప్పాని కృష్ణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పుప్పాల వీరన్న, జిల్లా ఉపాధ్యక్షుడు బండారి శ్రీనివాస్, ఎలిపద్ది సుధాకర్ రెడ్డి, జిల్లా జానయ్య, షేక్ మహబూబ్ సుభాని, మారోజు కృష్ణమూర్తి, మంచాల శ్యాంకుమార్, దామెర్ల లాలయ్య, పొలిశెట్టి శ్రీనివాస్, తస్నీరు రమేష్, పూసపెల్లి వెంకన్న, పూసపెల్లి మల్లయ్య, కోడెపాక మల్లిఖార్జున్, ధీకొండ మహేష్, మోదుగు శ్యాం సుందర్ రెడ్డి, బండిపెల్లి వెంకన్న పాల్గొన్నారు.

## నేడు సీతారామచంద్ర స్వామి కల్యాణం

**తాళ్లగడ్డ (సూర్యాపేట) :** పునర్వసు నక్షత్రం సందర్భంగా శుక్రవారం సూర్యాపేట పట్టణంలోని బొడ్రాయి బజార్‌లో గల శ్రీ వేదాంత భజన మందిరంలో శ్రీసీతారామచంద్ర స్వామి మాస కల్యాణం నిర్వహిస్తున్నట్లు మందిర అధ్యక్షుడు రాచర్ల వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన అర్చకుడు దరూరి సింగరాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పంచామృత అభిషేకంతోపాటు కల్యాణ వేడక నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కల్యాణం అనంతరం అన్నప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.



దేవతామూర్తుల విగ్రహాలు

## బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

**ఆత్మకూర్ (ఎస్) :** ట్రాక్టర్ ప్రమాదంలో మృతి చెందిన గుగులోత్ రమేష్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ మండల కన్వీనర్ యాతాకుల వెంకన్న డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోఏని బోరింగ్ తండాలో రమేష్ మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. అనంతరం ఆయన అంత్యక్రియల్లో పాల్గొన్నారు. రమేష్ మృతదేహానికి పలువురు నాయకులు నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సీఐటీయూ నాయకులు రంగు వెంకన్న, విజయ, గుండు రమేష్, చిరంజీవి తదితరులు ఉన్నారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

**నాగారం :** రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాశాఖ అధికారి, మండల ప్రత్యేక అధికారి అశోక్ హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలో ఎరువులు, పురుగుల మందుల దుకాణాన్ని తనిఖీ చేసి మాట్లాడారు. రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందించాలని డీలర్లకు సూచించారు. ఖరీఫ్ సీజన్‌కు సరిపడ ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచాలన్నారు. విత్తనాలు, ఎరువులను ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. పక్క రాష్ట్రాల నుంచి విత్తనాలు కొనుగోలు చేయవద్దని, నకిలీ విత్తనాలు, లూజ్ విత్తనాలు అమ్మే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హరికిషోర్‌శర్మ, ఎంపీడీఓ మారయ్య, మండల వ్యవసాయ శాఖ అధికారి కృష్ణకాంత్, మండల విద్యాధికారి వాసం ప్రభాకర్, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.



నాగారంలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న మండల ప్రత్యేక అధికారి అశోక్

## ఆలయ ప్రారంభోత్సవ కరపత్రం ఆవిష్కరణ

**చిలుకూరు :** మండల కేంద్రంలో పాత చిలుకూరుకు వెళ్లే దారిలో వంతెన వద్ద కల్లు గీత పారిశ్రామిక సంఘం, గౌడ కులస్తుల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన శ్రీకంఠమహేశ్వర సురామాంబదేవి ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాన్ని విజయవంతం చేయాలని గౌడ కుల పెద్దలు కోరారు. ఈమేరకు గురువారం ఆలయం వద్ద కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. వచ్చే నెల 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు ఆలయ ప్రారంభోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గౌడపెద్దలు కొండా కోటయ్య, బెల్లంకొండ నాగయ్య, మరీదు సైదులు, మండవ అచ్చయ్య, అంబాల రాంబాబు, ముక్కా లక్ష్మీనారాయణ, కొండా శేషయ్య, కొండా వీరబాబు, కొండా వెంకయ్య, బాలేబోయిన రవి, బొడ్డు కాశయ్య, పవన్, సైదులు, ముక్కా వీరబాబు, కట్టేకోల లక్ష్మీనర్సు, గుండు వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.



కరపత్రం ఆవిష్కరిస్తున్న గౌడ కుల పెద్దలు

## భూధార్ ప్రక్రియ వేగవంతం చేయాలి



తాళ్లసింగారం గ్రామంలో భూధార్ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఆర్డీఓ వేణుమాధవ్

**నూతనకల్ :** భూధార్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఎరువుల దుకాణాన్ని పరిశీలించడంతోపాటు తాళ్లసింగారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను, రైతు వేదికలో భూధార్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వ్యవసాయ అధికారులు ప్రతి రైతుతో మాట్లాడి భూధార్ నమోదు చేయాలని సూచించారు. ఎరువుల దుకాణ యజమానులు రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలను విక్రయించడంతోపాటు ఖరీఫ్ సీజన్‌కు సరిపడే విధంగా దుకాణాలలో స్టాక్ ఉంచాలని, రిజిస్టర్ల నిర్వహణను సక్రమంగా చేపట్టాలని ఆదేశించారు. వర్షాకాలం ప్రారంభమైనందున కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ధాన్యం కొనుగోళ్లను రెండు రోజుల్లో పూర్తి చేయాలని, ధాన్యం ఎగుమతులకు కావాల్సిన లారీలను సకాలంలో పంపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, ఏఓ మురళి, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై పోరాడేది సీపీఐ

**చివ్వెంల :** ప్రజా సమస్యలపై పోరాడేది సీపీఐ అని ఆ పార్టీ మాజీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బొమ్మగాని శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఖాసీంపేటలో నిర్వహించిన పదవ మహాసభలో పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో ప్రజాసంఘాలను నిర్మించి పార్టీని బలోపేతం చేయాలని, ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిరంతరం ప్రజల మధ్యన ఉండి పోరాటాలు చేయాలని కార్యకర్తలకు సూచించారు. ఈ సందర్భంగా గ్రామ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు బూర వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి ఖమ్మంపాటి రాము, పాదిల లింగయ్య, దంతాల రాంబాబు, రేగటి లింగయ్య, రాంబాబు, రామలింగం, వెంకటమ్మ, హేమలత, దుర్గయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బొమ్మగాని శ్రీనివాస్

## ముమ్మరంగా రైతు వివరాల నమోదు



ఆత్మకూర్ (ఎస్) : నసీంపేటలో రైతుల వివరాలు నమోదు చేస్తున్న అధికారులు



పెన్‌పహాడ్ : అనంతారంలో రైతుల వివరాలు నమోదు చేస్తున్న ఏఈఓ

**ఆత్మకూర్(ఎస్) :** రైతులకు సంక్షేమ పథకాలు నేరుగా అందేందుకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల నూతన పథకాన్ని తీసుకువచ్చింది. దీంతో వ్యవసాయ అధికారులు రైతుల వద్ద నుంచి వివరాలు సేకరిస్తూ ఆధార్ తరహాలో 11 అంకెలతో కూడిన యూనిక్ ఐడీ ఏర్పాటు చేస్తున్నారు. ఆత్మకూరు మండల వ్యాప్తంగా అన్ని క్లస్టర్లలో మండల వ్యవసాయ అధికారితో పాటు వ్యవసాయ విస్తరణ అధికారులు రైతుల నుంచి గత ఐదు రోజులుగా వివరాలు సేకరించి రిజిస్టర్ చేస్తున్నారు. మండల వ్యాప్తంగా 17,758మంది రైతుల వివరాలు నమోదు చేయాల్సి ఉండగా ఇప్పటివరకు 1,340 మంది వివరాలను నమోదు చేశారు. ఆధార్, పట్టాదారు పాస్‌బుక్‌లతోపాటు ఓటీపీలతో ఈ విశిష్ట సంఖ్యను నమోదు చేస్తున్నారు. దీంతో భవిష్యత్తులో కేంద్ర ప్రభుత్వం నుంచి అందే సంక్షేమ పథకాలు నేరుగా రైతులకు అందనున్నాయి.

**పెన్‌పహాడ్ మండలంలో..**

**పెన్‌పహాడ్:** ఫార్మర్ రిజిస్ట్రీని మండలవ్యాప్తంగా ఐదు రైతు వేదికల్లో ప్రారంభించారు. మండలంలో దాదాపు 16వేల మంది రైతులు ఉన్నారు. రైతులు భూయాజమాన్య పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్, ఫోన్ నంబరుతో ఏఈఓల వద్ద నమోదు చేసుకుంటే ఓటీపీ ద్వారా గుర్తింపు సంఖ్య నమోదవుతుంది.

**రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి**



కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు అందాలంటే రైతులు తప్పనిసరిగా ఏఈఓల వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకుని యూనిక్ ఐడీ పొందాలి. అన్ని గ్రామాలకు విస్తరణ అధికారులు వచ్చి వివరాలు సేకరిస్తున్నారు.

– దివ్య, మండల వ్యవసాయ అధికారి

**అవగాహన కల్పించాలి**

ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమంపై అవగాహన కల్పించాలి. గుర్తింపు వలన రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించాలి. వారిలో చైతన్యం నింపేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలి.

– నర్సయ్య, రైతు, అనాజిపురం, పెన్‌పహాడ్ మండలం

# రోడ్డు అధ్వానం.. ప్రయాణం ఇబ్బందికరం

- గుంతలమయంగా మారిన కొత్తగూడెం – గోరెంట్ల రహదారి
- వర్షాలకు రోడ్లపై నిలుస్తున్న నీరు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు





గుంతలమయమై వర్షపు నీటితో నిండిన కొత్తగూడెం - గోరెంట్ల రహదారి

**తుంగతుర్తి :** కొత్తగూడెం నుంచి గోరెంట్ల మీదుగా సూర్యాపేటకు వెళ్లే రహదారిలో కొత్తగూడెం – గోరెంట్ల మధ్య రోడ్డు పూర్తిగా దెబ్బతిని రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ఈ రహదారి వెంట నడవాలన్నా కష్టంగా ఉంది. వర్షాలకు రోడ్డు మీద ఏర్పడిన గుంతలు జలమయంగా మారాయి. ఈ రెండు గ్రామాల మధ్య ద్విచక్ర వాహనాలు, ఆటోలు నడవాలన్నా ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

**20 ఏళ్ల కింద నిర్మించిన రహదారే..**

గతంలో ఈ రెండు గ్రామాల మధ్య మెటల్ రోడ్డు ఉండేది. 20 సంవత్సరాల క్రితం ఈ రోడ్డును తారు రోడ్డుగా మార్చారు. అప్పటినుంచి ఇప్పటివరకు ఈ రోడ్డుకు మరమ్మతులు చేసిన దాఖలాలు లేవు.

**నడవాలన్నా ఇబ్బందులు..**

ప్రయాణికులు, రైతులు ఈ రోడ్డుపై నడవాలన్నా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కొత్తగూడెం గ్రామం నుంచి బస్టాండ్‌వరకు రోడ్డు మొత్తం కంకర తేలింది. ఈ రోడ్డు పరిస్థితిని చూసి గతంలో ఉన్న ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ కొత్తగూడెం బస్టాండ్ నుంచి గోరెంట్ల వరకు రోడ్డు మంజూరు చేయిస్తానని తెలిపారు. కానీ ఎన్నికలు జరిగిన తర్వాత కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం, స్థానిక ప్రజాప్రతినిధులు ఈ రోడ్డు విషయాన్ని పట్టించుకోకపోవడం లేదు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్ స్పందించి తారు రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

**తారు రోడ్డు వేయాలి**

కొత్తగూడెం నుంచి గోరెంట్ల వరకు రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. రోడ్డుపై అడుగడుగునా గుంతలు ఏర్పడ్డాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తారు రోడ్డు వేయాలి.

– జటంగి శ్రీను, కొత్తగూడెం

**కంకర తేలింది**

కొత్తగూడెం గ్రామం నుంచి బస్టాండ్ వరకు రోడ్డు కంకర తేలి ఉంది. కనీసం నడవడానికి కూడా చాలా ఇబ్బందికరంగా ఉంది. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

– కామ యాదయ్య, కొత్తగూడెం

# బీడు భూములు సాగులోకి..

- ప్రతి ఏటా పెరుగుతున్న సాగు విస్తీర్ణం
- పడావుబడిన భూములను సేద్యానికి అనువుగా మార్చుతున్న రైతులు

**అర్వపల్లి :** ప్రస్తుత వానాకాలం సీజన్‌లో పంటల సాగు మరింత పెరగనుంది. గోదావరి జలాలు రెగ్యులర్‌గా వస్తుండంతో రైతులు ఎన్నో ఏళ్లగా పడావుబడిన భూములను సాగులోకి తెస్తున్నారు. ఇప్పటికే బోళ్లు, గుట్టలను సైతం సేద్యానికి అనువుగా మార్చారు. ఇంకా కొన్నిచోట్ల పడావుబడిన భూములను బాగుచేసి సేద్యానికి అనువుగా మార్చుతున్నారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఇదే పరిస్థితి ఉంది.

**ఇప్పటికే 25వేల ఎకరాల్లో సాగు..**

జాజిరెడ్డిగూడెం మండల వ్యాప్తంగా ఇప్పటికే 25వేల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. గోదావరి జలాలు రాకముందు సుమారు 12వేల ఎకరాల్లో మండల వ్యాప్తంగా పంటలు సాగు కాగా గోదావరి జలాలు మొదలయ్యాక ఒకేసారి రెట్టింపు స్థాయిలో పంటల సాగు పెరిగింది. ప్రస్తుతం మరింత సాగు పెరగనుంది. గత 15 రోజులుగా మండల వ్యాప్తంగా రైతులు పలు గ్రామాల్లో పడావుబడిన భూములను సాగులోకి తేవడానికి రాళ్లు, కంపచెట్లను తొలగించి చదును చేయిస్తున్నారు. దీంతో ఈ సారి మరింత పంటల సాగు పెరగనుంది.



సీతారాంపురం సమీపంలో గుట్టవెంట పడావుబడిన భూమి సేద్యంలోకి ..

**ప్రతి సీజన్‌కు సాగు పెరుగుతుంది**



గోదావరి జలాల రాకతో ప్రతి సీజన్‌కు పంటల సాగు పెరుగుతోంది. గతంలో సాగైన భూమికి ప్రస్తుతం రెట్టింపు స్థాయిలో సాగు పెరిగింది. పడావుబడిన, రాళ్లు రప్పలు ఉన్న భూములను రైతులు బాగు చేసుకొని సేద్యానికి అనువుగా చేసుకుంటున్నారు. పంటలు సాగు చేసే సమయంలో తమ సూచనలు, సలహాలు పాటించాలి.

– పెందోట గణేష్, వ్యవసాయ అధికారి

## పేర్లు నమోదు చేసుకోవాలి

**అర్వపల్లి :** రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న ఫార్మర్ రిజిస్ట్రీలో రైతులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఏఈఓ శోభారాణి తెలిపారు. మండలంలోని రామన్నగూడం రైతువేదికలో గురువారం రైతు కార్డు నమోదును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రం పరిశీలన

**అర్వపల్లి:** జాజిరెడ్డిగూడెం మండలంలో 25 ధాన్యం కొనుగోలు కేంద్రాలకు గానూ 10 కేంద్రాల్లో కొనుగోళ్లు పూర్తయ్యాయని తహసీల్దార్ బాషపాక శ్రీకాంత్ తెలిపారు. గురువారం బొల్లంపల్లి, కాసర్లపహాడ్ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఇప్పటివరకు ఆయా కేంద్రాల్లో 2,47,948 క్వింటాల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. మరో 15 కేంద్రాల్లో కొనుగోళ్లు జరుగుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



కాసర్లపహాడ్‌లో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీకాంత్